సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



దుర్గమ్మకు వెండి కిరీటం


ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మకు కొమ్మల స్వామినాయుడు కుటుంబం (ద్రాక్షారామ) సుమారు రూ.1.30 లక్షలతో 1.3 కిలోల వెండితో కిరీటం సమర్పించింది.



రూ.1.50 లక్షల విరాళం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద నిర్మిస్తున్న ఆంధ్రా భద్రాద్రి ఆలయంలో గోదాదేవి విగ్రహం ఏర్పాటుకు రావూరి రాంబాబు రూ.1.50 లక్షల విరాళం సమర్పించారు.

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 2,500 కలిపి మొత్తం 3,900 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 20 పోలింగ్ కేంద్రాలు



తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇందులో రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌డీఓ ఆర్.కృష్ణనాయక్, అర్బన్ తహసీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావుతో కలిసి నగరంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాసన మండలి పూర్వ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థానానికి వచ్చే నెల 5వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. వచ్చే నెల 12వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల సిబ్బంది సూచనలను అనుసరించి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక వసతులూ కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో 129 అర్జీలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 129 అర్జీలు స్వీకరించామని డీఆర్‌ఓ టి.సీతారామమూర్తి తెలిపారు. ఈ అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 34 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం(పీజీఆర్ఎస్)కు 34 మంది తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వారితో ఎస్పీ డి.నరసింహ కిశోర్ నేరుగా మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట, దొంగతనం, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎంబీఎం మురళీకృష్ణ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజుకు 26 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు సోమవారం ఈ వివరాలు తెలిపారు. ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 26వ తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు. రూ.50 అపరాధ రుసుంతో 27 నుంచి డిసెంబర్ 2 వరకూ, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 3 నుంచి 9 వరకూ, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 10 నుంచి 16వ తేదీ వరకూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

నామినల్ రోల్స్, డాక్యుమెంట్లను ప్రధానోపాధ్యాయులు ఈ నెల 26వ తేదీలోగా అందజేయాలి. పరీక్ష ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి స్కూల్ లాగిన్ ద్వారా చెల్లించాలి. సీఎఫ్ఎంఎస్, బ్యాంకు చెల్లింపులను అనుమతించరు. పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించరు.

పరీక్ష ఫీజు వివరాలివీ..

- రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125.
- మూడు అంతకంటే తక్కువ సబ్జెక్టులు ఉన్న వారు రూ.110.
- మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉన్న వారు రూ.125.
- వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.125తో పాటు అదనంగా రూ.50 చెల్లించాలి.
- తక్కువ వయస్సు ఉన్న విద్యార్థులు కాండొనేషన్ ఫీజు రూ.300 చెల్లించాలి.
- అవసరమైతే మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.80 చెల్లించాలి.

ఆగనున్న ఆపద్బాంధవి

- సమ్మెకు సమాయత్తమవుతున్న 108 ఉద్యోగులు
- 25 నుంచి విధుల బహిష్కరణకు సిద్ధం
- ఇప్పటికే జిల్లా అధికారులకు నోటీసులు
- ప్రతి రోజూ వినూత్న రీతిలో పోరాటం
- మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిర్ణయం



సాక్షి, రాజమహేంద్రవరం: అత్యవసర వైద్యంపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర జేస్తోంది. ఆపదలో చిక్కుకున్న వారికి, అత్యవసర వైద్యం పొందే వారికి ఆపద్బాంధవులుగా నిలుస్తున్న ఉద్యోగులపై అక్కసు ప్రదర్శిస్తోంది. మూడు నెలలుగా వేతనాలు మంజూరు చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. దీంతో ఆగ్రహించిన 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. విధులు బహిష్కరించి రోడ్డెక్కనున్నారు. ఇప్పటికే ప్రతి రోజూ వినూత్న పద్ధతిలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు ఈ నెల 25వ తేదీలోగా సమస్య పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెళతామని స్పష్టం చేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అత్యవసర సేవలు అందిస్తున్నా సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ భారం మోయలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత, పని ఒత్తిడి, జీఓ నంబర్ 49 అమలు తదితర సమస్యలు దీర్ఘ కాలంగా వారిని వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి సమ్మె చేయాలని 108 ఉద్యోగ సంఘ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు నోటీసులు అందజేశారు.

కుటుంబ పోషణ.. భారం

108 సిబ్బంది అత్యవసర విధుల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు రోజుకు 12 గంటల పాటు పని చేయాల్సి వస్తోంది. అదనంగా చేసే పనికి గాను ప్రభుత్వం వారికి ఎటువంటి అదనపు చెల్లింపులూ చేయడం లేదు. ఒక్కో వాహనానికి కనీసం ఆరుగురు ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో పని చేయాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత ఉన్నా అలాగే నెట్టుకొస్తున్నారు. ఏ ఉద్యోగీ వారాంతపు సెలవు తీసుకోవడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పండగలు అస్సలు ఉండటం లేదు. డ్యూటీ వేసిన మరుక్షణం వెళ్లిపోవాల్సిందే. అంత యాతన అనుభవించి పని చేస్తున్నా.. సకాలంలో జీతాలు అందకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. కక్ష సాధింపులో భాగంగా అరబిందో సంస్థకు కూటమి ప్రభుత్వం నిధులు చెల్లించడం నిలిపివేసింది. దీంతో సంస్థ ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. 108లో పని చేస్తున్న ఈఎంటీ, పైలట్లకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకూ వేతనం అందుతోంది. సూపర్‌వైజర్లకు రూ.30 వేలు, మేనేజర్లకు రూ.50 వేలు చెల్లిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల వేతనాలు ఇంతవరకూ అందకపోవడంతో వారికి ఆకలి కేకలు తప్పడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

ఇవీ డిమాండ్లు

- 108 సేవల సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి, నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నంబర్ 49ని పునరుద్ధరించాలి. పైలట్ గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల మొత్తం, వార్షిక ఇంక్రిమెంట్ చెల్లించాలి.
- 108 ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అందువలన ప్రతి నెలా 5వ తేదీలోపే జీతాలు చెల్లించాలి.
- షిఫ్టుల పద్ధతి అమలు చేయాలి. 12 గంటలు పని చేయడంతో ఒత్తిడి పెరిగి ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో 108 ఉద్యోగులకు కూడా 8 గంటల పని విధానం అమలు చేయాలి.
- జీతంపై 40 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ఏరియర్లు వేతనంతో జమ చేయాలి.
- వైద్య, ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు ఇవ్వాలి.
- ఈపీఎఫ్‌కు సంబంధించి యాజమాన్య వాటా సొమ్మును యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.
- వేతన స్లాబ్‌లలో మార్పులు తీసుకురావాలి.
- 108 వాహనాలకు సమయానికి మరమ్మతులు చేయడం లేదు. దీంతో వాహనాలు కండిషన్ తప్పుతున్నాయి. వాహనాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలి.
- రిలీవింగ్ బిల్లులు, ఎలక్ట్రికల్ బిల్లులు, వాహన మైనర్ మరమ్మతు బిల్లులు, ఉద్యోగులకు చెల్లించాల్సినవి వెంటనే చెల్లించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- అత్యవసర సేవలకు మాత్రమే 108ను వినియోగించేలా చర్యలు చేపట్టాలి. సిబ్బంది కొరతను అధిగమించాలి.
- ప్రతి మండల కేంద్రంలోనూ సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలి.



పెరవలి ఎంపీడీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న 108 ఉద్యోగులు (ఫైల్)

అత్యవసర సేవలకు బ్రేక్!

108 ఉద్యోగుల సమ్మె ఆరంభమైతే జిల్లాలో ప్రమాదాల్లో చిక్కుకున్న వారికి అత్యవసర సేవలు అందని పరిస్థితి ఏర్పడనుంది. జిల్లా వ్యాప్తంగా 108 వాహనాలు 21 ఉన్నాయి. 99 మంది డ్రైవర్లు, ఎమర్జెన్సీ టెక్నీషియన్లు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వీరు కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రతి నెలా 60 వేల మందికి పైగా రోగులు వివిధ రకాల వైద్య సేవలు పొందుతున్నారు. 108 ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ సమ్మె సైరన్ మోగించింది. ఈ మేరకు 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్లకు సమ్మె నోటీసులు ఇచ్చారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న ఈ సమ్మెకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె ఆగదని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మె



అత్యవసర సమయాల్లో వైద్య సేవలందిస్తున్నా మాకు సకాలంలో వేతనాలు అందడంలేదు. మా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాం. ప్రభుత్వం దిగి రాకపోతే ఈ నెల 25 నుంచి సమ్మె బాట పడతాం. మా బాధలు ప్రభుత్వానికి తెలిసేలా ఇప్పటికే వినూత్న రీతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– రమణ, 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

108 ఉద్యోగుల రిలే దీక్ష



కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద 108 ఉద్యోగులు సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈఎన్‌వీ రమణ, గుజ్జుల రమేష్‌బాబు ఆధ్వర్యాన జె.నానాజీ, జి.రమేష్‌బాబు, ఎస్.శ్రీనివాస్, పి.జగపతిబాబు, వాసు, సునీత రిలే దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రమణ, రమేష్‌బాబు మాట్లాడుతూ, 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, తమను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, రోజుకు మూడు షిఫ్టులలో 8 గంటల పని విధానం అమలు చేయాలని, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, వైద్య, ఆరోగ్య శాఖలో ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలని, 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి పూర్ణిమరాజు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి రిలే దీక్షలను విరమింపజేశారు. 108 ఉద్యోగుల దీక్షకు అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం, ఆశా కార్యకర్తల సంఘం మద్దతు తెలిపాయని జిల్లా కమిటీ సభ్యులు వేంకటేశ్వరరావు, రమేష్‌నాయుడు, శ్రీధర్, నందిరాజు, శ్రావణి, సుమలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీగా మురళీకృష్ణ



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా అదనపు ఎస్పీగా ఎన్‌బీఎం మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

దేదీప్యమానం.. లక్ష దీపోత్సవం



లక్ష దీపాల కాంతుల్లో కోటిలింగాల రేవు



గోదావరికి, పరమ శివునికి హారతులు ఇస్తున్న నేతలు, నగర ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దక్షిణ కాశీగా పేరొందిన రాజమహేంద్రవరంలో.. గోదావరి తీరాన.. కోటిలింగాల రేవు.. లక్ష దీపాలు ఒక్కసారిగా వెలిగిన వేళ.. దేదీప్యమానంగా మెరిసిపోయింది. పవిత్ర కార్తికమాసంలో మహాశివుడికి ప్రీతికరమైన సోమవారం సాయంత్రం 5.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ సీతారామ దేవస్థానం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన 12వ లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల శివ నామస్మరణతో గోదావరి తీరం ప్రతిధ్వనించింది. కోటిలింగాల రేవులో మెట్లపై ఏర్పాటు చేసిన మట్టి ప్రమిదల్లో భక్తులు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. రేవులో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. వేదికకు ఇరువైపులా పువ్వులు, విద్యుద్దీపాలతో చేసిన అలంకరణలు, శివలింగాలు, వివిధ దేవతల ఏర్పాటు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి విజయలక్ష్మి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. అతిథులకు ట్రస్టు చైర్మన్, సీసీసీ ఎండీ పంతం కొండలరావు ఘన స్వాగతం పలికారు. ప్రముఖుల చేతుల మీదుగా మహాశివునికి, గోదావరి మాతకు 3 దశలుగా హారతులు ఇచ్చారు. భక్తులకు నిర్వాహకులు ప్రమిదలు, వత్తులు, నూనె సరఫరా చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- జీఓలు విడుదల చేయాలి
- కలెక్టరేట్ వద్ద కదం తొక్కిన ఆశా వర్కర్లు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, మినిట్స్ ప్రకారం జీఓలు, సర్క్యులర్లు విడుదల చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో ఆశా వర్కర్లు సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతికి యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.అన్నామణి మాట్లాడుతూ, ఇచ్చిన హామీ ప్రకారం జీఓలు విడుదల చేయకపోవడంతో ఆశా వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇటీవల రిటైరైన వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.60 వేలు అందలేదని, 60 సంవత్సరాలు నిండిన వారు రెండేళ్ల వయోపరిమితి పెంపుదలకు అనర్హులుగా మిగిలిపోయారని, ఇటీవల మరణించిన ఆశా వర్కర్లకు మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించలేదని, ఖాళీ పోస్టులు భర్తీ చేయలేదని, జీతంతో కూడిన మెటర్నిటీ లీవ్ సౌకర్యం కల్పించలేదని చెప్పారు. జీఓల విడుదలలో కాలయాపన చేయడం ద్వారా ఆశా వర్కర్లు నానాటికీ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేలా ప్రభుత్వమే చేస్తోందని విమర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులకు అనుమతి ఇవ్వాలని, సంబంధం లేని పనులు ఆశా వర్కర్లతో చేయించరాదని అన్నారు. ఆశా కార్యకర్తల విధుల్లో రాజకీయ జోక్యం నిరోధించాలని, వీహెచ్ఎన్‌సీ కమిటీల ద్వారా వర్కర్ల తొలగింపును ఆపాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన యూనిఫామ్‌ను ప్రభుత్వమే అందించాలన్నారు. 2024 ఫిబ్రవరి నుంచి రిటైరైన వారిని యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, గౌరవాధ్యక్షులు ఎం.సుందర్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల ఫ్యాక్టరీ టీడీపీ

- సూపర్–6 బూటకం
- చంద్రబాబు అబద్ధాలు బడ్జెట్‌లోనే తేలిపోయాయి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు
- యర్నగూడెంలో పార్టీ సమావేశం
- భారీగా తరలివచ్చిన శ్రేణులు




సమావేశంలో మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణు. వేదికపై మాజీ మంత్రి తానేటి వనిత, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

దేవరపల్లి: టీడీపీ అబద్ధాల ఫ్యాక్టరీ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి తానేటి వనిత అధ్యక్షతన యర్నగూడెంలోని ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చంద్రబాబు అబద్ధాలు బడ్జెట్‌లోనే తేలిపోయాయని చెప్పారు. సూపర్–6 అంతా బూటకమని, మహిళలకు ఉచిత బస్సు ఎక్కడా కనిపించడం లేదని, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ మొక్కుబడిగా జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధ పాలన జరుగుతోందని, చట్టాన్ని సక్రమంగా అమలు చేసేందుకు కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో అసంబద్ధమైన పోస్టులు పెట్టవద్దని, ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ఎండగట్టే విధంగా పోస్టులు పెట్టాలని సూచించారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం వైఎస్సార్ సీపీ పుట్టిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఏ సమయంలోనైనా ఎన్నికలు రావచ్చని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యకర్తలకు, నాయకులకు, సోషల్ మీడియా సైనికులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజకీయ వ్యవస్థలో కార్యకర్తలు గొప్పవారని, రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు బలం పుంజుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యం ధైర్యంగా ఉండాలని వేణు పిలుపునిచ్చారు.

రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలి

మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు, నాయకులపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందని అన్నారు. వైఎస్సార్ సీపీ ఉండకూడదనే కక్షతో టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తోందని దుయ్యబట్టారు. పార్టీ కోసం కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకుని, ఉత్సాహంగా పని చేసే కార్యకర్తలకు జిల్లా, రాష్ట్ర కమిటీల్లో స్థానం కల్పిస్తామని ఆమె తెలిపారు. వైఎస్సార్ సీపీ రామహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీడీపీ కూటమి అమలు చేయలేని అబద్ధపు హామీలు ఇవ్వడం వల్లనే మనం ఓడిపోయామని అన్నారు. గెలుపు ఓటములు సహజమని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని అన్నారు. రానున్న రోజుల్లో జగన్ నాయకత్వంలో కార్యకర్తల చేతులతో నడిచే ప్రభుత్వం వస్తుందని చెప్పారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, కాకులపాటి లలిత, శామ్యేలు, ముప్పిడి లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, గగ్గర శ్రీనివాస్, ప్రతాపనేని వాసుబాబు, పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా అధ్యక్షులు కదలి హైమావతి, ఆరేళ్ల లక్ష్మి, నాగమణి, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే వల్లీ, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.రాజేంద్రబాబు, నేతలు తొమ్మండ్రు రమేష్, బంకా అప్పారావు, కారుమంచి రమేష్, వెలగా శ్రీరామూర్తి, సాలి వేణు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మండల సర్వేయర్



రంగంపేట: మండల సర్వేయర్ చిక్కాల ధర్మారావు ఏసీబీ వలలో చిక్కారు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన బాధితుడు బత్తిన రాముడు కథనం ప్రకారం.. ఆయన తల్లికి సంబంధించి 1.34 ఎకరాలు, 66 సెంట్ల భూమి ఉంది. దీనికి సంబంధించిన సర్వే నంబర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరి చేయాలని విలేజ్ సర్వేయర్ సోని ప్రియాంకకు రాముడు ఫిర్యాదు చేశారు. ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో విలేజ్ సర్వేయర్‌ను ప్రశ్నించారు. ఆమె సూచన మేరకు మండల సర్వేయర్ ధర్మారావును కలిశారు. ఈ నేపథ్యంలో సర్వే నంబర్లు సరి చేయడానికి నెల రోజుల కిందట ధర్మారావు, సోని ప్రియాంక రూ.1.5 లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని రాముడు చెప్పగా, తాము జేసీ, తహసీల్దార్ తదితరులకు సొమ్ము ఇవ్వాలని, అప్పుడే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. చివరకు రూ.75 వేలకు బేరం పెట్టారు. ఈ నేపథ్యంలో రాముడు ఈ నెల 14న ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ తమ సిబ్బందితో కలసి సోమవారం సాయంత్రం దాడి చేశారు. రూ.75 వేల లంచం తీసుకుంటున్న ధర్మారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ యు.రంజిత్‌కుమార్‌ను సోమవారం సాయంత్రం కూడా కలవగా.. ఎలక్షన్ పనిలో బిజీగా ఉన్నామని, త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారని రాముడు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐ ఎన్‌వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాము కాటుకు మూడో తరగతి విద్యార్థి మృతి


మృతుడు ధనుష్

నల్లజర్ల: పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న మూడో తరగతి విద్యార్థి పాముకాటుకు గురై ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మండలంలోని సింగరాజుపాలెంలో ఈ దుర్ఘటన జరిగింది. నల్లజర్లలో నివాసం ఉంటున్న బోయపాటి సాగర్, కవితల ఏకైక కుమారుడు ధనుష్ (7). సాగర్ అయ్యప్పమాల వేసుకోవడంతో కవిత అక్క ఊరైన సింగరాజుపాలెం వీరు ముగ్గురూ వచ్చారు. ఆదివారం సాయంత్రం ఇంటి సమీపంలో దీపావళికి తెచ్చిన టపాసులు కాల్చుకుంటున్న ధనుష్ కాలి బొటనవేలిపై తుప్పల్లో ఉన్న తాచుపాము మూడుసార్లు కాటు వేసింది. ఈ హఠాత్ పరిణామాన్ని ధనుష్ తల్లికి చెప్పాడు. వెంటనే అతనిని నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిగూడెం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ధనుష్ నల్లజర్లలో ఒక పాఠశాలలో మూడో తరగతి చదువుతుండగా తల్లిదండ్రులు ఇద్దరూ వేర్వేరు విద్యాసంస్థల్లో టీచర్లుగా పనిచేస్తున్నారు. నాలుగు రోజులు ఆనందంగా గడుపుదామని ఇక్కడకు వచ్చిన వారి కుమారుడికి మృత్యువు పాముకాటు రూపంలో వచ్చిందని, ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, ఆ పరిసర ప్రాంత ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

పీఎఫ్ కార్యాలయానికి స్వచ్ఛత అవార్డు


అవార్డుతో రీజనల్ పీఎఫ్ కమిషనర్లు మనోజ్‌కుమార్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భవిష్యనిధి సంస్థ భవిష్య నిధి స్వచ్ఛత అవార్డు–2024 అందుకుంది. భవిష్యనిధి సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న తమ ప్రాంతీయ కార్యాలయాలకు వివిధ కేటగిరీల కింద భవిష్య నిధి అవార్డులను ప్రకటించింది. ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖామంత్రి మన్సుఖ్ మాండవియా చేతులమీదుగా అవార్డును రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ ఇన్‌చార్జి, రీజనల్ పీఎఫ్ కమిషనర్–1 మనోజ్‌కుమార్ అందుకున్నారు. రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 వై.డి.శ్రీనివాస్ పాల్గొన్నారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో భవిష్యనిధి స్వచ్ఛత అవార్డు పొందటానికి సహకరించిన అధికారులు, సిబ్బందిని ఆర్‌పీఎఫ్ కమిషనర్–1 మనోజ్‌కుమార్ అభినందించారు. ఈ అవార్డు సాధించడంలో సహాయపడిన హౌస్ కీపింగ్ సిబ్బందిని శాలువా, మెమెంటోతో సత్కరించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారాలలో

WANTED TEACHERS
Hindi Pandits, Maths, Social for High School (English Medium)
Salary : 30,000 & above
Cont : 73827 79555
SRI SATHYA SAI VIDHYA VIHAR
Annavaram - 533 406. Kakinada Dist.

ఓం సోమశేఖరాయనమః

కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఓం నమఃశివాయ నామస్మరణ మారుమోగింది. ద్రాక్షారామ, కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం, మురమళ్ల, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురంలోని శివాయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివార్లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల సమీపంలోని నదీ తీరాలు, కోనేరుల్లో భక్తులు స్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు. సాలిగ్రామ, దీప, వస్త్ర తదితర దానాలు చేశారు. పురోహితులకు స్వయం పాకాలు అందజేశారు. సాయంత్రం వరకు ఉపవాసాలు ఉండి మరోసారి ఆ సోమశేఖరుడి దర్శనం చేసుకొన్నారు. ఆలయాల్లో సామూహికంగా దీపారాధనలు నిర్వహించారు.


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తులు


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో కార్తిక దీపాలు వదులుతున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి


ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు


సామర్లకోటలో కుమార భీమేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ఇసుక, బొండుమట్టి ట్రాక్టర్లు

అయినవిల్లి: మండలంలో అక్రమంగా ఇసుక, బొండు మట్టి తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు సోమవారం ఎస్సై మనోహర జోషి తెలిపారు. మండలంలోని శానపల్లిలంక, కొండుకుదురు, వీరవల్లిపాలెం గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందంతో దాడి చేశారు. శానపల్లిలంకలో ఐదు, కొండుకుదురులో రెండు, వీరవల్లిపాలెంలో రెండు మొత్తం తొమ్మిది ట్రాక్టర్ల ద్వారా ఇసుక, బొండుమట్టి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. వాటిని సీజ్ చేసి, అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

పంచారామ క్షేత్రంలో ఆర్‌జేసీ సుబ్బారావు


ఆర్‌జేసీ కుటుంబ సభ్యులకు ఆశీర్వదిస్తున్న వేద పండితులు

సామర్లకోట: దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కొమ్ము సుబ్బారావు దంపతులు సోమవారం పంచారామ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆర్‌జేసీ దంపతులకు ఈఓ భళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవ స్వామి, పెద్ద నంది, మూలవిరాట్‌లను, స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం పండితుల ఆశీర్వచనాలు, స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఆలయ శ్రీచక్రపండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆలయ చరిత్ర, విశిష్టతను ఆర్‌జేసీకి వివరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు


సత్యదేవుని ప్రధానాలయం వెలుపల పెద్ద హుండీలో కానుకలు సమర్పిస్తున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో కార్తిక మాసం గడచిన 18 రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నారు. సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి దేవస్థానం సిబ్బంది అందరూ విధిగా హాజరు కావాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆదాయం లెక్కింపు సాయంత్రం వరకూ కొనసాగనుంది. ఏటా కార్తికంలో పౌర్ణమి తరువాత, మాసం ముగిశాక హుండీల ఆదాయాన్ని లెక్కించడం ఆనవాయితీ.

గత కార్తికంలో రూ.2.81 కోట్ల రాబడి

గత ఏడాది కార్తిక మాసంలో దేవస్థానానికి హుండీల ద్వారా రూ.2.81 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే వివిధ కారణాలతో గత కార్తికం ముందు ఒకసారి, మధ్యలో ఒకసారి, కార్తిక మాసం తరువాత పది రోజులకు ఒకసారి హుండీల ఆదాయం లెక్కించారు. దీంతో కార్తిక మాసం హుండీల ఆదాయాన్ని 30 రోజుల సరాసరిగా లెక్కించారు. గత ఏడాది కార్తికంలో అన్ని విభాగాల ద్వారా రూ.20 కోట్లు పైగా ఆదాయం వచ్చింది. ఈసారి ఇది రూ.25 కోట్లు పైబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్క హుండీల ద్వారానే రూ.3.5 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. తొలి విడతగా మంగళవారం జరిపే లెక్కింపులో సుమారు రూ.1.50 కోట్లు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గోడ కూలి మీద పడడంతో వ్యక్తి మృతి

పి.గన్నవరం: మండలంలోని కుందాపల్లి గ్రామంలో సోమవారం పాత పెంకుటిల్లును విప్పుతుండగా ప్రమాదవశాత్తూ గోడ కూలడంతో తీవ్ర గాయాలపాలై ఒక వ్యక్తి మృతిచెందాడు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కుందాలపల్లికి చెందిన కాసర శ్రీనివాసరావు తన పాత ఇంటిని విప్పే పనులను కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన కామిశెట్టి సూరిబాబుకు అప్పగించాడు. దీంతో సూరిబాబు వానపల్లి గ్రామానికి చెందిన గంధం దుర్గాప్రసాద్, అతడి తండ్రి సత్యనారాయణ, తమ్ముడు ఆదినారాయణ (33)లతో కలిసి సోమవారం పెంకిటిల్లును విప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ ఇంటి గోడ కూలి ఆదినారాయణపై పడింది. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆదినారాయణ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని సోదరుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

టూ టౌన్ సీఐ సస్పెన్షన్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక టూ టౌన్ సీఐ దుర్గారావు సస్పెండ్ అయ్యారు. ఒక కేసు విషయంలో లంచం తీసుకున్నారనే ఆరోపణలతో ఆయన్ని సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుడివాడలో దుర్గారావు సీఐగా పనిచేస్తుండగా, ఒక కేసు విషయంలో లంచం తీసుకున్నారని బాధితులు ఐజీకి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆ కేసు విచారణ చేపట్టారు. శాఖా పరమైన చర్యల్లో భాగంగా సీఐ దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

స్త్రీ నిధి రూ.22.లక్షల స్వాహా

- పరారీలో వీఓఏ
- విచారణ చేస్తున్న అధికారులు


విచారణ చేస్తున్న ఏపీఎం వేదకుమారి

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి గ్రామ సంఘం–1లో వీఓఏ పనిచేస్తున్న కె.దుర్గ 11 మహిళా సంఘాల సభ్యుల నుంచి సుమారు రూ.22.5 లక్షలు స్త్రీనిధి డబ్బును స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా డీఆర్‌డీఏ అధికారుల ఆదేశాలతో ఏపీఎం శరకణం వేదకుమారి బూరుగుపూడిలోని తల్లీపిల్ల భవనంలో సోమవారం డ్వాక్రా సంఘాల మహిళలతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూరుగుపూడిలో వీఓఏ దుర్గ మూడు నెలలుగా స్త్రీనిధి సొమ్ము చెల్లించలేదన్నారు. దీంతో డబ్బు కట్టాలని నిలదీయడంతో ఈ నెల 10లోపు సొమ్ము చెల్లిస్తానని చెప్పారన్నారు. స్త్రీనిధి సొమ్ము చెల్లించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టగా వీఓఏ పరారీలో ఉన్నారని ఆమె తెలిపారు. దీనిపై మరింత విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే గ్రామ సంఘాల సభ్యుల ఆమోదంతో తీర్మానం చేసి ఆమెపై కేసు నమోదు చేస్తామన్నారు. తమకు తెలియకుండానే సంఘాల్లోని సభ్యుల పేరున స్త్రీనిధి డబ్బు కాజేయడం అన్యాయం అని డ్వాక్రా సంఘాల మహిళలు వాపోయారు. అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సొమ్మును రికవరీ చేయాలన్నారు.

మంత్రి సుభాష్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

కోనసీమ శెట్టిబలిజ నాయకుల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ శెట్టిబలిజ నాయకులు

అమలాపురం టౌన్: కాకినాడలో ఆదివారం జరిగిన శెట్టిబలిజ కార్తిక వన సమారాధనలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలు మా కులానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయని కోనసీమ శెట్టిబలిజ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. మంత్రి చేసిన వ్యాఖ్యలపై వారు అభ్యంతరం చెబుతూ ఖండించారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో సోమవారం సాయంత్రం జరిగిన శెట్టిబలిజ నాయకుల సమావేశం మంత్రి సుభాష్ తమ సామాజిక వర్గ నాయకులను సంస్కార హీనులని, వెధవలని చేసిన వ్యాఖ్యలపై చర్చించింది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై తమ సామాజిక వర్గం సిగ్గు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శెట్టిబలిజలు సంస్కార వంతులుగా ఉండడం వల్లే జిల్లాలో కొందరు సామాజిక వర్గ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసినప్పుడు ఐక్యతతో గెలిపించి చట్ట సభలకు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రితోపాటు ఇద్దరు శెట్టిబలిజ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూడా ఎంత మాత్రం సమంజసంగా లేవని వారు అభిప్రాయపడ్డారు. తక్షణమే మంత్రి సుభాష్ తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కోనసీమ శెట్టిబలిజ సంఘ నాయకులు మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, వాసంశెట్టి తాతాజీ, సంసాని బులినాని, రెడ్డి సత్య నాగేంద్రమణి, వాసర్ల వెంకన్న, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, విత్తనాల ఇంద్రశేఖర్, దొంగ చిన్నా తదితరులు సమావేశమై మంత్రి సుభాష్ సుభాష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

పోలవరం కుడి కాలువలో మునిగి విద్యార్థి మృతి

- స్నానానికి దిగిన ఆరుగురు విద్యార్థులు
- ఐదుగురు సురక్షితం


గౌతమ్ మృతదేహం

దేవరపల్లి: స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థుల్లో ఒకరు పోలవరం కుడికాలువలో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం దేవరపల్లిలో జరిగింది. ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న పాముల గౌతమ్ (11) తన తోటి ఐదుగురు స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైస్కూలుకు సమీపంలోని పోలవరం కుడి కాలువ వద్దకు వెళ్లాడు. వీరు పోలవరం కుడి కాలువలో స్నానానికి దిగారు. వీరిలో గౌతమ్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఇది గమనించినా తోటి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఉండిపోయారు. రాత్రి 12.30 గంటల సమయంలో గౌతమ్ తల్లిదండ్రులు వెంకట్రావు, శిరీష్ దంపతులు తన కుమారుడు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌతమ్‌తో వెళ్లిన ఐదుగురు స్నేహితులను పిలిచి విచారించగా కాలువలో స్నానానికి దిగి గౌతమ్ మునిగిపోయాడని తెలిపారు. విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపల్లి, యర్నగూడెం, ధుమంతునిగూడెం, దేవరపల్లి గ్రామాల మధ్య గాలింపు జరుపగా కాలువలో మునిగిపోయిన ప్రదేశానికి 200 మీటర్ల దూరంలో గడ్డిదుబ్బుకు చుట్టుకుని ఉన్న బాలుడి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ముగిసిన హాకీ పోటీలు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలుర జట్టు

- బాలికల విజేత తూర్పు
- బాలుర విజేత విశాఖ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఈ నెల 16 నుంచి జరుగుతున్న ఎస్‌జీఎఫ్‌ఐ పాఠశాల క్రీడాసమాఖ్య అంతర్ జిల్లాల హాకీ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్టు, బాలుర విభాగంలో విశాఖ జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, విశాఖ ద్వితీయ, తృతీయస్థానాలు, బాలుర విభాగంలో తూర్పు, అనంతపురం జట్లు రెండు, మూడు స్థానాలు కై వసం చేసుకున్నాయి.

బహుమతి ప్రదాన కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ అతిథులుగా పాల్గొన్నారు. రాంచీలో డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును ఎంపిక కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ పరిశీలకులు సెల్వ పాండియన్, ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్, కె.పరశురాం, పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్ర బాలికల జట్టు

భవిష్యత్తు ప్రణాళికను తీర్చిదిద్దేందుకే సమావేశాలు

– పరిశోధనా కమిటీ సమావేశాలలో సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్


సమావేశాలు ప్రారంభించిన సీటీఆర్‌ఐ డైరెక్టర్ శేషుమాధవ్, డాక్టర్ వీరరాఘవయ్య

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పరిశోధనా నిపుణులు గత సంవత్సరం జరిగిన పరిశోధనలను పరిశీలించి, లోపాలను సవరించి, భవిష్యత్తు ప్రణాళికను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతారని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్‌ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. స్థానిక సీటీఆర్‌ఐ సమావేశ మందిరంలో నాలుగు రోజులపాటు జరగనున్న పరిశోధనా కమిటీ సమావేశాలు సోమవారం ఆయన అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వీరరాఘవయ్య, సంస్థ డైరెక్టర్, ఐఆర్‌సీ ప్రెసిడెంట్ డాక్టర్ శేషు మాధవ్, సీటీఆర్‌ఐ ఫార్మర్ హెడ్ డాక్టర్ సి.సి.ఎస్. రావు, మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎం.అనురాధ లాంఛనంగా జ్యోతి వెలిగించి సమావేశాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన మొదటి సాంకేతిక సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కస్తూరి కృష్ణ, డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డాక్టర్ టి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎం.కుమరేసన్, డాక్టర్ జె.పూర్ణ బిందు, డాక్టర్ పార్థ సాహా, డాక్టర్ నమిత దాస్ సాహా తదితరులు సాంకేతిక సమావేశం–1 లో వారి వారి పరిశోధనల ఫలితాలను వెల్లడించారు. సాంకేతిక సమావేశం ఒకటికు డాక్టర్ ఆర్. వీర రాఘవయ్య, డాక్టర్ సి.సి.ఎస్. రావు నిపుణులుగా వ్యవహరించి, పరిశోధనా లోపాలను సరిచేసి, ప్రతి ప్రయోగానికి ముందుగానే భూసార పరీక్షలు, తేమ శాతం, ఆమ్ల/ క్షార స్థాయి, సూక్ష్మ జీవుల స్థాయి వంటి పరీక్షలు జరపాలని సూచించారు. రెండవ సాంకేతిక సమావేశాలకు ప్రొఫెసర్ జయశంకర్, అగ్రికల్చరల్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జె. సత్యనారాయణ, సీటీఆర్‌ఐ ఫార్మర్ హెడ్, డాక్టర్ యు.శ్రీధర్ నిపుణులుగా వ్యవహరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ One Sitting Degree, B.Ed, B.P.Ed, B.Tech, Nursing. Contact : 86888 47183 [L-794851]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253919]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445 [HA-99066]

■ Wanted Male Batch Incharges Qualification Any Degree Age Limit: 25 to 45 years, Salary: 15000/- to 18000/- Female Hostel Warden Age Limit: 25 to 35. Salary: 12000/-. Location: Rajahmundry. Contact: 92487 33370 [G-5747]

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ ముత్తూట్ మనప్పురం ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. ✆ : 98491 38626 [R-1260825]

Wanted

■ ప్రముఖ కంపెనీలో లోన్స్ ప్రమోట్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆ : 62817 92982 [R-1260827]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.